సింగిల్ పేజీ కథ

# పాటి

బి.పి.కరుణాకర్

ఉదయం పదకొండున్నర అయి ఉంటుంది. తెలుగు లెక్చరరు రాజమన్నారు క్లాసు నడుస్తోంది. అతను ఇన్ని సంవత్సరాలుగా ఆ ఉద్యోగం వెలగబెడుతున్నా పాఠాలు చెప్పడం ఇంతవరకు చాతకాలేదు. ఎం.ఫిల్ చేశాడు. పి.హెచ్.డి. కూడా అయిందనిపించుకుంటాడు. ప్రొఫెసరు అయ్యాక ఎంత మందికి గైడ్ అయి తను రాసిన కథల మీదో, తనిచ్చిన ఉపన్యాసాల మీదో, తన వ్యాసాలు లేక నవలల మీద బలవంతంగా రీసెర్చ్ చేయమంటాడో, ఏమో! అలాటివాడే.

తను తెలుగు బాగా చెబుతుంటాననే అభిప్రాయం అతనిలో బాగా పాతుకుపోవడం వలననుకుంటాను, కొమ్ములు మొలుచుకువచ్చి కనబడుతూ ఉంటాయి. పాఠంకన్నా పత్రికల్లో తను రాసిన కథల గురించి ఎక్కువగా చెబుతుంటాడు. చెప్పినవే మళ్లీ చెబుతోంటే ఎన్ని సార్లని వినడం? అతను చెప్పుకుంటూనే వెళ్తుంటాడు. కబుర్లు చెప్పుకునేవాళ్లు చెప్పుకుంటూ ఉంటారు. గీతలాటలు ఆడుకునేవాళ్లు ఆడుతూ ఉంటారు. అతని పాఠం మీద నాకే మాత్రం ధ్యాస ఉండేది కాదు. లైబ్రరీ నుండి తెచ్చుకున్న పుస్తకాలు తీసి చదువుకుంటూ ఉండేవాడిని. నా జోలికి ఎవరూ వచ్చేవాళ్లు కాదు. నేను ఎవరి జోలికి వెళ్లేవాడిని కాదు. ఆ రోజు రాజమన్నారుకు ఏమయిందో ఏమో నన్ను పేరెట్టి పిలిచి, "లేచి నుంచో" అన్నాడు.

అతనికి నా పేరు తెలుసని నాకు తెలియదు. ఎవరూ ఎవరి గురించి పట్టించుకోరు. ఒక్కొక్కరు ఒకరిద్దరికి హాజరు పలుకుతుంటారు. విద్యార్థులు కూడా అలానే చేస్తూ ఉంటారు. విద్యార్థులకూ హాజరు పలికిన సమయాలు లేకపోలేదు. నేను కేవలం హాజరు కోసం క్లాసుకు వస్తుంటాను. ఇక్కడ చదువుకుంటూ బయటి ఉద్యోగం చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు.

రాజమన్నారు నన్ను నుంచోమంటున్నాడని నేను అనుకోలేదు. తెలుగు క్లాసుకు బి.ఎ., బి.యస్.సి విద్యార్థులు, విద్యార్థినులు అన్ని సెక్షన్లవాళ్ళు కలిసి ఎనభయి మంది వరకు ఉంటారు. అతని ముఖంలోకి చూసి, "నేనా?" అడిగాను.

"నువ్వే".

నన్నెందుకు లేచి నుంచోమంటున్నాడో నాకు అర్థం కాలేదు. అంతకుముందు అతను క్లాసులో ఎవరినీ నుంచోమని అనలేదు. మా కాలేజీలో అసలా పద్ధతే లేదు.

ఎందుకు గొడవని లేచి నుంచున్నాను.

"బయటకు వెళ్లు" అన్నాడు.

క్లాసురూం ఒక్కసారిగా నిశ్శబ్దమయింది. అక్కడక్కడ నిద్ర పోతున్నవాళ్లు క్లాసు అయిపోయిందనుకున్నట్టు అనిపించిందేమో హఠాత్తుగా మేలుకొన్నారు. ఇద్దరయితే లేచి నుంచుని పుస్తకాలు సర్దుకోసాగారు.

"ఎందుకు?" నిబ్బరంగా అడిగాను.

"పిల్లికూత కూసినందుకు".

"సుందరరాజు పిల్లుల్ని తినడు. అందుచేత పిల్లికూతలు కూయడు" అన్నాడొక విద్యార్థి.

అందరూ ఘొల్లుమని నవ్వారు.


నా పేరు సుందరరాజు.

ఆ మాట అన్న విద్యార్థిని రాజమన్నారు ఏం అనలేదు. కనీసం వాడి వంకయినా చూడలేదు.

"మన క్లాసులో తిరిగే పిల్లి ఏమయింది?" ఒక విద్యార్థిని అడిగింది. నవ్వులతో గది నిండింది. "పిల్లినా, పిల్లనా?"

ఈసారి విద్యార్థులకన్నా విద్యార్థినులే పెద్దగా నవ్వారు.

పాఠాలు చెబుతున్నప్పుడు ఒక్క పిల్లి అరుపులే కాదు. అన్ని రకాల జంతువుల అరుపులు అరవడం పరిపాటి. చాలా సమయాల్లో విద్యార్థులకన్నా విద్యార్థినులే నాటీగా ఉంటారు. లెక్చరర్లు ఎవరూ సీరియస్‌గా



తీసుకోరు. అయితే ఈ గొడవ తెలుగు క్లాసులోనే ఎక్కువగా ఉంటుంది. రాజమన్నారు ఈ విషయాన్ని మునుపెన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. ఎక్కడో ఒకచోట ఆపాలని నిర్ణయించుకున్నాడేమో.

కాలేజి జీవితం మళ్లీ మళ్లీ రాదు. ఏకత్వంలో భిన్న స్పర్శలు తగులుతున్నా ఆనందంగా ఉంటుంది. జీవితమంతా అంత ఆనందంగా గడిచిపోతే ఎంత బావుంటుంది అనిపిస్తుంది. ఎవరు నవ్వినా కేంపస్‌లో పూలు పూసినట్టు ఉంటుంది. లెక్చరర్లు, చివరకు ప్రిన్సిపల్ ఏదో పెద్ద తప్పు అయితే తప్ప స్టూడెంట్సుతో కలిసిపోతారు. మరి ఆ రోజు ఎందుకో ఈ నవ్వులాటలు రాజమన్నారుకు నచ్చినట్టు లేదు. శివాలెత్తుతూ, "నువ్వు బయటకు వెళ్తావా, లేదా?" అరిచినట్టుగా అన్నాడు.

అతనితో పోట్లాట పెట్టుకోవడం నాకు మనస్కరించలేదు. వెళ్దామని పుస్తకాలు సర్దుకుంటోంటే, "వెళ్తాడులే, దానికి ఆల్సేషన్‌లా అరవాలేంటి?" ఎవరో అన్నారు. ఈ మాటకు అందరూ నవ్వుతోంటే క్లాసులోంచి బయటకు వచ్చాను. జరిగినదంతా ముందు నాకూ నవ్వులాటగా అనిపించినా, తర్వాత ఆ సంఘటన పదే పదే నా మనసులో కదులుతోంటే నేను చేయని తప్పుకు అవమానం పాలయినట్టు అనిపించింది. అంత మందిలో అతనికి నేనొక్కడినే దొరికానా? వీడు అమాయకుడు. నోరెత్తడు. ఎదురు తిరగడు అనుకుని నన్ను ఎంచుకున్నాడా?

ఆ సాయంత్రం కేంటిన్‌లో కూర్చుని టీ తాగుతోంటే వెళ్లి రాజమన్నారు పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని అతని చేయి గట్టిగా పట్టుకున్నాను. కప్పులోని టీ ఒలికి అతని చొక్కా మీద, జేబులో పడింది. లేవబోయాడు. లేవనీయలేదు. రెండో చేత్తో అతని చేతిలో ఉన్న కప్పు అందుకుని బల్ల మీద పెట్టి, "ఉదయం క్లాసులో నన్ను అవమానించినందుకు నిన్ను తన్నడానికి రాలేదు. తన్నినా నిన్ను ఆదుకోడానికి ఎవరూ రారు. సాక్ష్యం కూడా చెప్పరు. నువ్వీ కాలేజీకి కొత్తవాడివి కావు. నీకు ఇక్కడి విషయాలు బాగా తెలుసు. ముందీ మాటకు జవాబు చెప్పు... నన్ను క్లాసులోంచి ఎందుకు వెళ్లగొట్టావు?" నెమ్మదిగానే అడిగాను. నాకు అంతే ధైర్యం ఎలా వచ్చిందో నాకే తెలియదు. అతను అసలు ఊహించి ఉండడు. అతని ముఖం భయంతో బిగుసుకుపోతోంది.

"ఆ పిల్లికూత..." ఆగాడు.

"... నేను వేయలేదు... ..." గట్టిగానే అన్నాను. కేంటిన్‌లో ఎక్కువ మంది లేరు. చేతిపట్టు మరింత బిగించాను. కాలేజి నుండి సస్పెండయితే అయ్యాను కాని రాజమన్నారుతో అటో ఇటో తేల్చుకోవాలనే ఉంది. అతని కళ్లలో భయం కనబడుతోంది.

"అవును... నువ్వు వేయలేదు..."

"ఎవరు వేశారో నీకు తెలియదా?" నా కోపం గడ్డకట్టే ఉంది.

"తెలుసు. రామకృష్ణారెడ్డి. అతన్ని క్లాసులోంచి వెళ్లగొట్టలేక నిన్ను వెళ్లిపొమ్మన్నాను... ..."

"ఇది రెడ్ల కాలేజీ కాదు కదా?"

అతను జవాబు చెప్పలేదు.

"స్టూడెంట్సు యూనియన్‌కు ఆఫీసు బేరరూ కాదు. నీ రీసెర్చి అయిపోయింది. ఒక కాలు బయట పెట్టి యూనివర్సిటీలోకి వెళ్లిపోదామనే ప్రయత్నంలో ఉన్నావు. మెల్లగా ప్రొఫెసరయి డీన్‌గా ఎగబాకి, ఏ రాజకీయ ప్రాబల్యం వలనో వైస్ చాన్సలర్ అయ్యానంటే నీ న్యాయం ఇలానే ఉంటుంది" అని అతని చేతిని వదిలేశాను.

ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సరాలకు ఎస్వీ యూనివర్సిటీకి ఒక టెన్యూరు వైస్‌ఛాన్సలర్‌గా వెలిగాడు. ఎందరి జీవితాలతో చెలగాటాలు ఆడుకుని ఉంటాడో?